సాక్షి జగిత్యాల

గురువారం । 4 । జనవరి । 2024



వేంకటేశ్వరాలయంలో వేడుకలు

కోరుట్ల:పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో నమ్మళ్‌వార్ పరమ పదోత్సవం నిర్వహించారు. ఈవో విక్రమ్, పెడిపెల్లి నర్సయ్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



బిల్లులు రాక.. భోజనం లేక

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రైవేట్‌కు ధీటుగా బోధించడంతో పాటు మధ్యాహ్న భోజనం, దుస్తులు, పుస్తకాలను అందిస్తామని హామీ ఇచ్చి పాఠశాలల్లో చేర్చుకున్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
25.0/15.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి వేళ చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఇసుక పాయింట్ ఏర్పాటు చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: భవన నిర్మాణదారులపై భారం పడకుండా జిల్లాలో ఇసుక పాయింట్ ఏర్పాటు చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్ యాస్మిన్ బాషాకు వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలో గతంలో నిర్వహించిన ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏడాది క్రితం నిలిపివేశారని, దీంతో భవన నిర్మాణదారులు బ్లాక్‌మార్కెట్‌లో ఇసుక కొని నష్టపోతున్నారని, స్టాక్ పాయింట్‌ను ప్రారంభిస్తే ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతోపాటు ఇంటి నిర్మాణదారులపై భారం తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ధరూర్‌క్యాంపులో స్టాక్‌పాయింట్‌ను ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నందున మరో స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు.

జిల్లాలో 31 వరకు పోలీస్ యాక్ట్ అమలు



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 31వరకు జిల్లాలో పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించొద్దని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించినా.. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



ఎస్ఈకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

జగిత్యాలజోన్: జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. విద్యుత్ ఓసీ అసోసియేషన్ ఉద్యోగులు ఎస్ఈని ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యుత్ బిల్లుల వసూలుకు కృషి చేయాలని సూచించారు. డీఈ రాజిరెడ్డి, ఓసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, కార్యదర్శి అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభలకు వెంకట్



వెంకట్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల విద్యాలయం సంస్కృత ఉపన్యాసకుడు వెంకట్ రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఎంపికయ్యారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల 5, 6, 7 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెంకట్ తెలిపారు. ఇందులో భారతీయ సంస్కృతి వైభవంపై పద్యాలు ఆలపించడంతోపాటు పద్య, గద్య, కవితా సదస్సు, అవధాని, భక్తి, వాగ్గేయ, కవితా, బాల, పత్రికా, గేయ, కథా, ఆకాశవాణి, ఆధునిక, చలనచిత్ర, హాస్యసాహిత్య వైజ్ఞానిక సదస్సుల్లో పాల్గొని మానవీయ విలువపై కథారూపంలో చెప్పనున్నట్లు పేర్కొన్నారు.

సఖీ సేవలు బాగున్నాయి

జగిత్యాల: సఖీ సేవలు బాగున్నాయని ఎన్నికల వ్యయ పరిశీలకులు శీల్ ఆశిష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సఖీ సెంటర్‌ను పరిశీలించారు. బాధిత మహిళలు, సఖీ పిల్లల సంక్షేమానికి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. అనంతరం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మహిళల పరిస్థితులు తెలుసుకుని వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. వారి కుటుంబాలను ఏకం చేయాలన్నారు. మంచి దిశవైపు మళ్లిస్తున్న సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలూ బాగున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడె పు భాస్కర్, సఖీ కేంద్రం నిర్వాహకురాలు మనీల, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి హరీశ్ పాల్గొన్నారు.

రోడ్లపైనే ఫ్లెక్సీలు



- ఇది జిల్లాకేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లోని ప్రధాన రహదారి. ఇక్కడ ఎప్పుడూ వాహనాల రద్దీ ఉంటుంది. ఆస్పత్రులు ఉండటం, బోర్డులు రోడ్డుపక్కనే ఏర్పాటు చేయడంతో వాహనాలను పార్కింగ్ చేయలేకపోతున్నారు. అయినా ట్రాఫిక్, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.



- ఇది జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తాలోని ప్రాంతం. ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. షాపుల యజమానులు రోడ్లపైనే ఫ్లెక్సీలు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రజలకు నడవడానికీ ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు రోడ్డు చిన్నగా ఉండడం.. వాహనాలు వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.



రోడ్డను ఆనుకుని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



- ఇది అశోక్‌నగర్‌లోని ప్రధానమైన జంబిగద్దె రోడ్. ఇక్కడ అనేక ఆస్పత్రులు, చిన్నచిన్న షాపులు ఉన్నాయి. వీరంతా సైన్‌బోర్డులను రోడ్డుపై పెడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పాదచారులకు, వాహనాదారులకు ఇబ్బందికరంగా మారింది.



- ఇది జంబిగద్దె నుంచి గొల్లపల్లి రోడ్ వైపు వెళ్లే రహదారి. ఇక్కడ కొన్ని వందల సంఖ్యలో ఆస్పత్రులున్నాయి. వాటికి సంబంధించిన సైన్‌బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. బోర్డులను ఇదిగో ఇలా రోడ్లపైకి వచ్చేలా పెట్టారు.

- ప్రచారం కోసం అడ్డదారులు
- అనుమతి దాటి ఏర్పాటు
- వాహనదారులకు ఇబ్బంది

జగిత్యాల: జిల్లాకేంద్రం.. శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అదేస్థాయిలో ఆస్పత్రులు, సూపర్‌మార్కెట్లు, కిరాణషాపులు, స్కానింగ్ సెంటర్లు, వాణిజ్య వ్యాపారాలు కూడా అత్యధికంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా జిల్లాకేంద్రంలోని కొత్త బస్టాండ్ నుంచి టవర్‌సర్కిల్ వరకు.. తహసీల్ చౌరస్తా నుంచి జంబిగద్దె వరకు.. జంబిగద్దె నుంచి అశోక్ థియేటర్ వరకు.. పాత బస్టాండ్ ఏరియాల్లో అత్యధిక వాణిజ్య సముదాయాలు ఏర్పడ్డాయి. సదరు యజమానులు వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసుని.. వాటి ముందు మామూలు బోర్డులు పెట్టుకున్నారు. క్రమేణా రోడ్డును ఆనుకుని పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. షాపుల ముందు ఏర్పాటు చేసుకున్న బోర్డులను రాత్రి సమయంలో కొందరు షాపులో పెట్టుకుంటున్నారు. అయితే పెద్ద పెద్ద ఫ్లెక్సీలను తొలగించే అవకాశం లేకపోవడంతో అలాగే ఉంటున్నాయి. ఇవి వాహనదారులు, ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయి. కొందరు రేడియం వంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అవి రాత్రిపూట రిఫ్లెక్షన్ ఇస్తున్నాయి. ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

టౌన్‌ప్లానింగ్ ఎక్కడా..?

రోడ్లను ఆనుకుని ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పేదలుగానీ.. కొందరు సామాన్యులు ఏవైనా నిర్మాణాలు చేపడితే అక్రమమంటూ వెంటనే కూల్చివేస్తున్న అధికారులు.. ఇలా వాణిజ్య సముదాయాల ముందు యథేచ్ఛగా బోర్డులు ఏర్పాటు చేస్తే మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. పూర్తిగా రోడ్డును ఆనుకునే ఫ్లెక్సీలు పెడుతుండడంతో పార్కింగ్‌కు సైతం ఇబ్బందిగా మారుతోంది.

> ### చర్యలు తీసుకుంటాం
>
> రోడ్లను ఆనుకుని ఫ్లెక్సీ బోర్డులు ఎవరూ పెట్టవద్దు. తద్వారా ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయి. పార్కింగ్ కూడా కష్టమే. రోడ్లను ఆనుకుని ఫ్లెక్సీలు పెట్టినా.. షెడ్లు వేసినా నోటీసులు ఇస్తాం. ప్రతిఒక్కరూ వారి పరిధిలోనే బోర్డులు పెట్టుకోవాలి. రోడ్లను ఆనుకుని ఉంటే చర్యలు తీసుకుంటాం.
>
> – శ్యామ్, టీపీఎస్

ఇరుకు రోడ్లతో ఇబ్బంది

జిల్లాకేంద్రంలో ఇరుకైన రోడ్లే అధికంగా ఉన్నాయి. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని కూడా ఆక్రమించి మరీ బోర్డులు ఏర్పాటు చేస్తుండడంతో ఆస్పత్రులు, ఇతర పనుల నిమిత్తం జిల్లాకేంద్రానికి వచ్చే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక సతమతం అవుతున్నారు. ఇక ఆటోల్లో వెళ్లినా ఆలస్యం అవుతోంది. ముఖ్యంగా ఆస్పత్రుల ఏరియాల్లో అయితే వారి ఆస్పత్రికి సంబంధించిన నేమ్‌బోర్డులను ఎక్కడబడితే అక్కడ పెడుతున్నారు.

స్థలాలు కబ్జా

రోడ్లను ఆనుకుని స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు. షాపుల ముందు కాకుండా రోడ్డుపైవరకూ వచ్చి బోర్డులను పెట్టడం.. మరికొందరు రేకులషెడ్లను నిర్మించడంతో వాహనాల రాకపోకలు సవ్యంగా సాగడం లేదు. వాస్తవానికి షెట్టర్లు, భవనాలను అద్దెకు తీసుకున్నప్పుడు అనుమతి మేరకు ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ కొందరు అవేమీ పట్టించుకోకుండా రోడ్డుపైకి వచ్చేలా రేకులషెడ్లు, బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నేడు ధర్మపురి ఎమ్మెల్యేతో ఫోన్ ఇన్



గొల్లపల్లి: ధర్మపురి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి 'సాక్షి' ఈనెల 4న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో ఫోన్‌–ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌తో మాట్లాడి పరిష్కరించుకోవచ్చు.

ఫోన్ ఇన్ తేదీ
04-01-2024 (గురువారం)
సమయం: మధ్యాహ్నం 2 నుంచి 3గంటల వరకు..

ఫోన్ నంబర్: 94414 75444

కొండగట్టులో రాముడి అక్షింతలకు పూజలు



కొండగట్టు(చొప్పదండి): అయోధ్య నుంచి కొండగట్టు అంజన్నస్వామి వారి ఆలయానికి చేరిన శ్రీరాముడి అక్షింతలకు అర్చకులు బుధవారం ఘనంగా పూజలు చేశారు. ముందుగా సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి గ్రామస్తులతో కలిసి అక్షింతలను స్వామివారి సన్నిధికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం అక్షింతలను గ్రామానికి తీసుకెళ్లి ప్రజలకు పంపిణీ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ సెల్ డీఎస్పీ డీవీ.రంగారెడ్డి



మాట్లాడుతున్న రంగారెడ్డి

జగిత్యాలక్రైం: యువత, ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెల్ డీఎస్పీ డీవీ. రంగారెడ్డి అన్నారు. బుధవారం సైబర్ నేరాలు, సైబర్ భద్రతపై జాగృతి దివాస్ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు, యువత, ప్రజలకు సైబర్ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ నేరాలను నివారించడమే జిల్లా పోలీసుల లక్ష్యమన్నారు. తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ జాగృత దివస్ కార్యక్రమం ద్వారా సైబర్ భద్రతతోపాటు, సైబర్ నేరాలపై అవగాహన నివారణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతకాలంలో వాట్సాప్, ఫేస్‌బక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాను పిల్లలు ఎక్కువగా వాడుతున్నారని, వాటిని వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలన్నారు. కార్యక్రమం ద్వారా నేర్చుకున్న ప్రతిఒక్కరూ మిగతా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు సైతం సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలని, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అందరికీ అవగాహన తప్పనిసరి అన్నారు.

అక్షరబాటలు వేసిన పూలే



పూలేకు నివాళి అర్పిస్తున్న చంద్రశేఖర్‌గౌడ్

జగిత్యాలటౌన్: చదువుతో అజ్ఞానాన్ని తొలగించాలని, దేశంలోని ఆడబిడ్డలందరికీ విద్య ఆవశ్యకతను చాటిచెప్పి అక్షరబాటలు వేసిన సావిత్రిబాయి పూలే సేవలు వెలకట్టలేనివని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. సావిత్రిబాయిపూలే 193వ జయంతిని జిల్లాకేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహిళల చదువుతోనే వారి కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చని ఆనాడే గుర్తించారని పేర్కొన్నారు. తొలి మహిళా గురువు, రచయిత్రి సావిత్రిబాయి పూలే ఆశయాలను మహిళాలోకం ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. అంతకుముందు తహసిల్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ప్రభుత్వ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని 25, 26వార్డుల్లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఐదో రోజు ప్రజలు, లబ్ధిదారులు ప్రజాపాలనలో పాల్గొని విజయవంతం చేశారన్నారు. జిల్లాలోని 57 గ్రామపంచాయతీలు, 134 మున్సిపల్ వార్డుల్లో సమావేశాలు నిర్వహించామని, గ్రామాల పరిధిలో 38,943 దరఖాస్తులు, మున్సిపల్ వార్డుల్లో 9,753, జిల్లా వ్యాప్తంగా 48,698దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఐదురోజుల్లో మొత్తంగా 2,38,187 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ పరిశీలన

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అనంతారం, తక్కళ్లపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుదారుడి వివరాలు, మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత పథకాలు లబ్ధిపొందడానికి నిర్ణీత ఫారంలో సూచించిన పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు జలేందర్, జైపాల్‌రెడ్డి, డీపీవో దేవరాజ్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

ధర్మపురి అభివృద్ధిపై సీఎంకు వినతి



సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ధర్మపురి నృసింహస్వామి ఆలయంతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ధర్మపురిని టెంపుల్‌సిటీగా మార్చాలని, ఈనెల 18నుంచి 24వరకు శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో వేద పారాయణం, వేదహవనం నిర్వహించనున్న నేపథ్యంలో నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సాగు, తాగునీటి సమస్య పరిష్కరించాలని, అన్ని మండలాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

జగిత్యాల: ఉద్యోగులు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని అడ్లూరి అన్నారు. టీఎన్జీవో నాయకులు ఆయనను బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశిధర్, నాగేందర్‌రెడ్డి, సాహేద్ బాబు, రవీందర్, రాజేందర్, భువనేశ్వర్, సుగుణాకర్, మమత, వినోద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పల్లె దవాఖానాను సందర్శించిన కేంద్రబృందం



వైద్యులు, సిబ్బందితో సమావేశమైన కేంద్రబృందం

రాయికల్: మండలంలోని కట్కాపూర్ పల్లె దవాఖానాను బుధవారం కేంద్రబృందం సభ్యులు ప్రేమాన్స్, డాక్టర్ శ్రీలక్ష్మీ బృందం పరిశీలించింది. దవాఖానాలో రోగులకు అందిస్తున్న సేవలు, బిల్డింగ్ నాణ్యత ప్రమాణాలు, పేషెంట్ల రికార్డులు, మాతాశిశువుల సంరక్షణ పనితీరు, టీబీ వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలపై ఆరా తీసి నివేదికను కేంద్రానికి పంపిస్తామని సభ్యులు తెలిపారు. జిల్లా వైద్యాధికారి శ్రీధర్, సర్పంచ్ రాజమౌళి, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ సతీశ్, అంజిత్‌రెడ్డి, నేషనల్ క్వాలిటీ మేనేజర్ నాగరాజు, హెచ్‌వో శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీధర్, సీహెచ్‌వో ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ. శ్రీధర్, రాహుల్, రుహాన్సీ, ఏఎన్‌ఎం లలిత, విజయలక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనల సేఫ్టీవాల్స్

- మరమ్మతు చేయాలంటున్న ప్రజలు
- నిధులకు అధికారుల ప్రతిపాదనలు



లక్ష్మీదేవిపల్లి వద్ద ఎస్ఆర్ఎస్‌పి కాలువపై వంతెనకు దెబ్బతిన్న సేఫ్టీవాల్

సారంగాపూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువలపై నిర్మించిన వంతెనలు రోజురోజుకూ బలహీనపడుతున్నాయి. సారంగాపూర్ మండలంలోని డి–53 ప్రధాన కాలువపై పలుచోట్ల వంతెనల సేఫ్టీవాల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఫలితంగా ఈ వంతెనపై నుంచి వెళ్లాలంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు. ఎస్సారెస్పీ కాలువలపై ఎప్పుడో 1978–1980 ప్రాంతంలో పలుచోట్ల వంతెనలు నిర్మించారు. వీటిపైనుంచే రైతులు రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు పొలాలకు నీరు వెళ్లేలా కూడా అప్పటి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇలా డీ–53 ప్రధాన కాలువపై పలుచోట్ల వంతెనలు నిర్మించారు. వాటిపై వెళ్లేసమయంలో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ఇరువైపులా సేఫ్టీవాల్స్‌ను బలంగా నిర్మించారు. ఏళ్లు గడుస్తుండడంతో సేఫ్టీవాల్స్ చాలాచోట్ల ధ్వంసమయ్యాయి. ఫలితంగా వంతెనలపైనుంచి వెళ్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో సుమారు 500 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంటుంది. ప్రమాదవశాత్తు అందులో పడిపోతే పెను ముప్పు వాటిల్లుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతిన్న సేఫ్టీవాల్స్..



రంగపేట వద్ద దెబ్బతిన్న సేఫ్టీవాల్

- జగిత్యాల–సారంగాపూర్ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై లక్ష్మీదేవిపల్లి వద్ద డి–53 కాలువపై వంతెన ఇరువైపులా దెబ్బతింది.
- రంగపేట నుంచి రాయికల్ వెళ్లే దారిలో రంగపేట శివారు డి–53 ప్రధాన కాలువపై సేఫ్టీవాల్స్ దెబ్బతిని అత్యంత ప్రమాదకరంగా మారింది.
- డి–53 కాలువపై హబ్సీపూర్ వద్ద సేఫ్టీవాల్స్ దెబ్బతిన్నాయి.
- బుగ్గారం వద్ద డి–53 కాలువ వంతెన ప్రమాదకరంగా మారింది.
- అల్లీపూర్ వద్ద కూడా ఇదే కాలువపై సేఫ్టీవాల్స్ దెబ్బతిన్నాయి.
- బీర్‌పూర్ శివారు రోల్లవాగు ప్రాజెక్టు దిగువన ఆర్‌వి మెయిన్ ప్రధాన కాలువపై.. బీర్‌పూర్ గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దెబ్బతిన్నాయి.

> ### మరమ్మతుకు ప్రతిపాదనలు
>
> డీ–53 ప్రధాన కాలువతోపాటు, ఎస్సారెస్పీ ప్రధాన కాలువలపై గతంలో ఏర్పాటు చేసిన వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. వాటిపై సర్వే జరిపి, రక్షణ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే రక్షణగోడలు నిర్మాణం చేపడతాం.
>
> – చక్రూనాయక్, డీఈ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం


సంజీవ్ (ఫైల్)

పెగడపల్లి:మండలంలోని బతికపల్లి శివారు కొండాయపల్లికి చెందిన క్యాస సంజీవ్ (40) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం సంజీవ్ పనినిమిత్తం మంగళవారం రాత్రి జగిత్యాలకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. నుద్దపల్లి నుంచి లింగాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఆరబోసిన వడ్ల కుప్ప కనిపించకపోవడంతో ఢీకొట్టాడు. అనంతరం బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. సంజీవ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 20 గొర్రెలు మృత్యువాత


మృతిచెందిన గొర్రెల వద్ద బాధితుడు ఐలయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో గొర్రెలమందపై కుక్కలు దాడి చేయడంతో ఇరవై గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గంగాళ్ల ఐలయ్య తన షెడ్డులో ఉంచిన గొర్రెల మందపై కుక్కలు మంగళవారం రాత్రి దాడి చేశాయి. కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతిచెందగా, మరికొన్ని గొర్రెలు గాయపడ్డాయి. ఉదయం ఐలయ్య మంద వద్దకు వెళ్లి చూడగా గొర్రెలు చనిపోయి కనిపించాయి. నెల రోజుల క్రితమే సింగిల్‌విండో నుంచి రూ.6లక్షల రుణం తీసుకుని గొర్రెలను కొనుగోలు చేశానని బాధితుడు విలపించాడు. కుక్కలదాడితో రూ.2లక్షల వరకు నష్టపోయానని వాపోయాడు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఆదుకోవాలని వేడుకున్నాడు. కాగా వారం కిత్రమే పెంటయ్య గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి పది గొర్రెలను చంపివేశాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం:జగిత్యాల జిల్లాకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన నక్క రాజయ్య (48) అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మంగళవారం వ్యవసాయ పనులకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా వెదికారు. చివరకు గుట్టరాజేశ్వరస్వామి ఆలయం సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. రాజయ్య భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితి మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఏఎస్సై వేణురావు తెలిపారు.

ఇంద్రజాలికుడు రత్నాకర్ మృతి


రత్నాకర్‌గౌడ్ (ఫైల్)

రాయికల్:రాయికల్ పట్టణానికి చెందిన జాతీయస్థాయి ఇంద్రజాలికుడు గొల్లపల్లి రత్నాకర్‌గౌడ్ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. 20 ఏళ్లుగా ఇంద్రజాల ప్రదర్శనలు ఇస్తున్న ఆయన రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. ఆయన మృతిపట్ల కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

7న ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ మహిళ, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక పోటీలు ఈనెల 7న అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నటరాజు రవి, మహేందర్‌రావు తెలిపారు. ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 10 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

పొగమంచుతో ప్రమాదం

- చిరువ్యాపారి ఆటోను ఢీకొట్టిన లారీ
- ఒకరికి తీవ్ర గాయాలు
- త్రుటిలో తప్పి పెనుప్రమాదం


ప్రమాదానికి కారణమైన లారీ


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

సిరిసిల్లక్రైం: శీతాకాలంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు పెను ప్రమాదానికి కారణమైంది. చిరువ్యాపారికి చెందిన టిఫిన్ తయారీ వాహనాన్ని లారీ ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడఅర్బన్ మండల పరిధిలోని చంద్రగిరిలోని తెట్టెకుంట ఏరియాలో నివసించే బొప్పరాజు శ్రీకాంత్, రమాదేవి రగుడు సమీపంలోని వాటర్‌ట్యాంక్‌కు ఎదురుగా మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే బుధవారం తెల్లవారుజాము 5.30 గంటల ప్రాంతంలో వారి ఇంటి నుంచి టిఫిన్ విక్రయించే ప్రాంతానికి ఆటోలో సామగ్రితో బయలుదేరారు. ఇదే సమయంలో కరీంనగర్ ప్రధాన రహదారి నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న ఫ్లెయాష్(బూడిద)తో కూడిన లారీ మొబైల్ టిఫిన్ సెంటర్ ఆటోను వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమాదేవి తీవ్రంగా గాయపడగా, శ్రీకాంత్‌కు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికంగా ఉదయం వాకింగ్‌కు వచ్చిన వాళ్లు ప్రమాదాన్ని గుర్తించి క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ చంద్రయ్యను స్థానికులు అడ్డుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

బిల్లులు రాక.. భోజనం లేక

- యామాపూర్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టని నిర్వాహకులు
- ఇంటినుంచి తెచ్చుకుని తింటున్న వైనం
- పట్టించుకోని అధికారులు, గ్రామస్తులు


ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుని పాఠశాలలో తింటున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల కన్నా దీటుగా బోధించడంతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, ఉచిత పుస్తకాలను అందిస్తామని హామీ ఇచ్చి పాఠశాలల్లో చేర్పుకున్నారు. గ్రామంలో బడిబాట నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కోరారు. కానీ విద్యార్థులకు మాత్రం మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు. మండలంలోని యామాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7 వ తరగతి వరకు 41 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 6,7 తరగతుల్లో విద్యార్థులు లేకపోవడంతో 6 గురు ఉపాధ్యాయుల్లో ఇద్దరిని డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు పంపించారు. 1 నుండి 5 వ తరగతి చదువుతున్న తరగతుల విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన నుంచి మధ్యాహ్న భోజన ఎజెన్సీ నిర్వాహకులు వారికి సరిగ్గా బిల్లులు, జీతాలు రావడం లేదని మధ్యాహ్న భోజనం వండడం లేదు. దీంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఇన్‌చార్జి ఎంఈవో ఆనంద్‌రావుకు రాతపూర్వకంగా ఇచ్చి సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామస్తులకు తెలిపినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న 41 మంది విద్యార్థులు ఇంటి నుంచి భోజన బాక్సులను తెచ్చుకుని మధ్యాహ్నం పాఠశాలల్లో తింటున్నారు. కొంత మంది విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనం చేసి మళ్లీ పాఠశాలకు వస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మధ్యాహ్న భోజన ఎజెన్సీ నిర్వాహకులను ఏర్పాటు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రారంభం నుంచే అన్నం పెడుతలేరు



బడి ప్రారంభమైన నుంచి పాఠశాలలో అన్నం పెడుతలేరు. నేను, చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచే డబ్బాలో అన్నం తెచ్చుకుని తింటున్నాం. అధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం పెట్టించాలి.

– ఎర్ర తేజస్, యామాపూర్, 5వ తరగతి విద్యార్థి

ఎవరూ పట్టించుకోవడం లేదు



పాఠశాల ప్రారంభం నుంచి మధ్యాహ్న భోజన ఎజెన్సీ నిర్వాహకులు వంట వండేందుకు రావడం లేదు. ఎన్నో సార్లు చెప్పినప్పటికీ నిర్వాహకులు వస్తలేరు. మధ్యాహ్న భోజనం వండేందుకు ఎవరినైనా నియమించాలని సర్పంచ్‌కు, ఎంపీటీసీకి, గ్రామస్తుల దృష్టికి తీసుకపోయినా పట్టించుకోలేదు. దీంతో విద్యార్థులకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు.

– కోటగిరి రత్నం, హెచ్‌ఎం

సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్య

- బర్త్‌డేకు గిఫ్ట్ అంటూ సోషల్ మీడియాలో వైరలవుతున్న వీడియో
- కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదు


శివసాయి

తిమ్మాపూర్: సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో మండలంలోని మల్లాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన కోమటి శివసాయి(23) కరీంనగర్‌లో సెల్‌ఫోన్ రిపేర్ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శివసాయి ఈనెల ఒకటిన ఎల్‌ఎండీ కట్టపై పురుగుల మందు తాగాడు. తర్వాత బావ అడిచర్ల నరేశ్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పాడు. వెంటనే నరేశ్ 108కు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు.

ఆత్మహత్యపై అనుమానాలు..

ఇదిలా ఉండగా శివసాయి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతన్నాయి. ప్రేమ విఫలంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బర్త్‌డేకు చిన్న గిఫ్ట్ అంటూ ఆ వీడియోలో పేర్కొన్నాడు. దీంతో లవ్ ఫెయిల్యూర్ అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.

పోలీసుల విచారణ..

ఇదిలా వుండగా కడుపునొప్పి భరించలేక తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నట్లు శివసాయి తండ్రి కోమటి కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ పోలీసులు తెలిపారు.

డిప్యూటీ సీఎంకు రాజన్న ప్రసాదం


డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు ఎడ్ల శివసాయి

వేములవాడ: రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కను కలిసి రాజన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ఎడ్ల శివసాయి, వేదపండితులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో విద్యుత్ మోటార్ల దొంగలు

- చితకబాది పోలీసులకు అప్పగించిన రైతులు


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

జగిత్యాలక్రైం:జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొద్దిరోజులుగా విద్యుత్ మోటార్లు, సర్వీస్ వైర్లను దొంగిలిస్తున్న దొంగలను రైతులు పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. మండలంలోని జాబితాపూర్, తిమ్మాపూర్, లక్ష్మీపూర్, కన్నాపూర్, కల్లెడ, పొలాస గ్రామాల్లో ఎన్నికలకు ముందు నుంచి విద్యుత్ మోటార్లు, విద్యుత్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. ఈ క్రమంలో రైతులు అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మోతె శివారులో విద్యుత్ వైరును దొంగిలిస్తుండగా ఓ రైతు పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అతడి నుంచి తప్పించుకుని పారిపోయేందుకు యత్నించగా.. సమీపంలోని రైతులందరూ వెంబడించి ముగ్గురు దొంగలను పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వారిలో ఒకరిది బోధన్‌గా.. మిగిలిన ఇద్దరిని జంబిగద్దె ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. వీరు దొంగిలించిన వైరును కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు తెల్సింది.

నేషనల్ పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం


కాంస్య పతకం సాధించిన సిరిచందనను అభినందిస్తున్న డాక్టర్ వంశీ కృష్ణారావు

కరీంనగర్‌స్పోర్ట్స్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గత డిసెంబర్ 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరిగిన నేషనల్ ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లాకు చెందిన తుడి సిరిచందన అద్వితీయ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. 52 కేజీల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి మే నెలలో హంకాంగ్‌లో జరగబోయే ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సిరిచందనను ద్వారకామయి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వంశీ కృష్ణారావు, అడ్మినిస్ట్రేషన్ రాజమహేందర్ అభినందించారు. ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వెళ్లటానికి హాస్పిటల్ తరుపున ఆర్థికసాయం అందించేందుకు ముందుకు రావడం విశేషం.

జగిత్యాలలో యువకుడి వీరంగం


మత్తుమందు చల్లిన యువకుడు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. తనవద్ద బస్‌చార్జీలు లేవని, తనను మల్యాల వద్ద దింపాలని అక్కడే ఉన్న ఓ ప్రయాణికుడిని కోరాడు. అతను నిరాకరించడంతో తన వద్దనున్న మత్తుమందు చల్లాడు. దీంతో సదరు ప్రయాణికుడు అస్వస్థతకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన సునీల్ కొద్దిరోజులుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి జగిత్యాలకు చేరుకున్న అతడు.. అక్కడే ఉన్న ఓ ప్రయాణికుడిపై మత్తుమందు చల్లాడు. అస్వస్థతకు గురైన సదరు ప్రయాణికుడు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సునిల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతడి వద్ద చిన్నచిన్ని మారణాయుధాలు కూడా లభించాయి. బుధవారం అతని కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకుడిని ఇలా వదిలిపెట్టవద్దని సూచించారు.

పోక్సో కేసులో ఇద్దరి అరెస్టు

- విద్యార్థులను వేధించిన ప్రబుద్ధులు
- సిరిసిల్లలోని హాస్టల్స్ వద్ద పోకిరీల వేధింపులు
- కటకటాలకు పంపించిన పోలీసులు

సిరిసిల్లక్రైం: వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన ఇద్దరు పోకిరీలపై సిరిసిల్ల పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు విధులు నిర్వర్తించే కార్యాలయాల సమీపంలో ఉన్న ఓ హాస్టల్‌లోని విద్యార్థినులను ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేసే వ్యక్తితోపాటు మరొకరు కొద్ది రోజులుగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. వీరి ఆగడాలు గమనించిన స్థానికులు, హాస్టల్ నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన సిరిసిల్ల పోలీసులు విద్యార్థుల వ్యక్తిగత వివరాలు బయటకు పొక్కకుండా పోకిరీలపై పోక్సో కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

చోరీ కేసులో అరెస్ట్

రామగిరి(మంథని): లద్నాపూర్ గ్రామంలోని మహలక్ష్మి వైన్‌షాపులో ఈనెల 2న జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు మంథని సీఐ సతీశ్ తెలిపారు. రామగిరి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లద్నాపూర్ గ్రామానికి చెందిన మహలక్ష్మి వైన్స్‌లో చోరీ జరిగిందని ఈనెల 2న దాడి రజనీకాంత్ తమకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సమీప సీసీ కెమెరాల ద్వారా నిందితులు, వారు ఉపయోగించిన ఆటో గుర్తించారు. ఈక్రమంలో పన్నూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అటుగా అనుమానితులు వచారు. వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితుల్లో పెద్దపల్లికి చెందిన సయ్యద్ షఫీఉద్దీన్, మరొకరు మైనర్‌గా గుర్తించారు. నిందితుల వద్ద రూ.98వేల నగదు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన 24 గంటల్లో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రవిప్రసాద్, సిబ్బంది సదానందం, కిరణ్, శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ట్రినిటి విద్యార్థి


రతన్‌ను అభినందిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్: మహబూబ్‌నగర్ జిల్లాలో గత డిసెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ట్రినిటి కళాశాల విద్యార్థి పులిరూబి రతన్ అత్యంత ప్రతిభ కనబరిచి హర్యానాలోని హిస్సార్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల పీఈటీ తెలిపారు. ట్రినిటి కళాశాలల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ దయాకర్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది బుధవారం రతన్‌ను అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రినిటి గ్రూఫ్ ఆఫ్ కళాశాలల నుంచి విద్యార్థులు వివిధ క్రీడల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

'సహకార' సేవ.. సాంకేతిక తోవ

కరీంనగర్ అర్బన్: సహకార శాఖ సాంకేతిక బాటలో సాగుతోంది. మూసధోరణికి స్వస్తి పలికి కాలానుగుణంగా ఆన్‌లైన్ దారి పడుతోంది. కొత్త సంఘాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు ప్రభుత్వం 'ఈ-సహకార సేవ' పోర్టల్‌ను తీసుకువచ్చింది. కొత్త సొసైటీల ఏర్పాటుకు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లోనే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ చేతికొస్తుంది. దీనికితోడు ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో రిజిస్టర్ అయిన సొసైటీలు, సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సహకార శాఖ కమిషనర్ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సభ్యులు మేజర్ అయి ఉండాలి

కొత్తగా ఏర్పాటయ్యే సంఘాలు సంబంధిత శాఖ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తెలంగాణ సహకార సంఘాల చట్టం-1904 ప్రకారం 21 మంది సభ్యులు, పరస్పర సహాయ సహకార సంఘాల చట్టం -1995 ప్రకారం 10 మంది సభ్యులతో కొత్త సొసైటీ కోసం అర్జీ పెట్టుకోవచ్చు. తర్వాత సొసైటీ పేరు, సభ్యుల వివరాలు ఆన్‌లైన్ ద్వారా జిల్లా సహకార శాఖ అధికారి లాగిన్‌కు వెళ్తాయి. సదరు అధికారి పరిశీలించి, నూతన సంఘం రిజిస్ట్రేషన్ చేసేందుకు కిందిస్థాయి అధికారితో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయిస్తారు. వివరాలు సరిగా ఉంటే డీసీవోకు నివేదిస్తారు. అనంతరం జిల్లా అధికారి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. దీన్ని ఆన్‌లైన్, మీసేవ సెంటర్లలో తీసుకోవచ్చు. ఆయా సంఘాలను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించడంతోపాటు దరఖాస్తు హార్డ్‌కాపీని డీసీవో కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. కాగా, ప్రభుత్వం వెబ్ పోర్టల్‌ను గత జూలైలో ప్రారంభించింది. దీనిపై అంతగా అవగాహన లేకపోవడంతో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసుకునేవారు మాన్యువల్‌గానే చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఏటా 4 నుంచి 5 కొత్త సంఘాలు, అధిక సంఖ్యలో మహిళా సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని అంటున్నారు. సహకార సంఘాల నియమావళి ప్రకారం కొత్త సంఘాలు ఏర్పాటు చేసుకునే సభ్యులు మేజర్ అయి ఉండాలి. కుటుంబంలోని ఇద్దరు ఒకే సంఘంలో సభ్యులుగా ఉండకూడదు. జైలుశిక్ష పడినవారు అనర్హులు.

ఏయే సంఘాలు చేసుకోవచ్చంటే..

ఉద్యోగుల పరపతి, గృహ నిర్మాణ, కార్మిక, వినియోగదారుల, మహిళా పొదుపు సహకార సంఘాలు, రైతు పరస్పర సహకార సంఘాలు, జాయింట్ ఫార్మింగ్, వెల్ఫేర్ సొసైటీలు.

తక్కువ సమయంలో పూర్తి..

కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం రిజిస్టర్ అయిన సొసైటీలు, సభ్యుల వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. సహకార, పరస్పర సహకార చట్టాల ప్రకారం జిల్లాలో 51 సంఘాలు, వాటిలో 1.25 లక్షల మందికి పైగా సభ్యులు ఉన్నారు. కాగా, ఆన్‌లైన్ విధానం ద్వారా కొత్త సంఘాలను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవచ్చని, తక్కువ సమయంలోనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని జిల్లా సహకార శాఖ అధికారులు తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి


మాట్లాడుతున్న కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌అర్బన్: కేడీసీసీ బ్యాంకు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగు కోసం ఇస్తున్న టర్మ్‌లోన్, అంతరపంటలకు కేడీసీసీబీ ద్వారా ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉద్యానవన పంటలు, పాడిపశువులు, చేపల పెంపకం, పౌల్ట్రీలకు సంబంధించిన వివరాలను ఉమ్మడి జిల్లాకు ప్రతిపాదించి, రాష్ట్రస్థాయి సాంకేతిక సమావేశానికి సిఫారసు చేశారు. నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, కేడీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్.సత్యనారాయణరావు, కరీంనగర్, జగిత్యాల జిల్లాల ఎల్డీఎంలు ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల వ్యవసాయాధికారులు శ్రీధర్, వి.భాస్కర్, జిల్లా పశువైద్యాధికారి బి.నరేందర్, ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

మానకొండూర్‌రూరల్: ఇల్లంతకుంట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ఏడో తరగతి చదువుతున్న మానకొండూర్‌కు చెందిన దావ శ్రీహర్షిణి, శ్రీనివాస్‌నగర్ కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతున్న రమాదేవి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్ క్రీడాప్రాంగణంలో బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీల ఎంపికలు నిర్వహించారు. నాలుగు జిల్లాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. అత్యంత ప్రతిభ కనబరిచి శ్రీహర్షిణి, రమాదేవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 6,7,8వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రిన్సిపల్ శోభారాణి, స్పెషల్ ఆఫీసర్ స్వప్న పీఈటీ వరలక్ష్మి, కోమలత, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రావి ఆకు మీద సావిత్రిబాయి పూలే



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్న సూక్ష్మ కళాకారుడు, కవి, సైకతశిల్పి గాలిపెల్లి చోళేశ్వర్‌చారి రావి ఆకు మీద సావిత్రి బాయి పూలే చిత్రాన్ని చిత్రీకరించాడు. చోళేశ్వర్‌చారిని ప్రిన్సిపాల్ రాజేశ్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.